# కృత్రిమ మేధా సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి







మోర్తాడ్, బతుకమ్మ: కృత్రిమ మేధా సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. పెద్దన్న అన్నారు. అన్నా-అక్కా మార్గదర్శక శిక్షణ కార్యక్రమంలో భాగంగా కృత్రిమ మేధా సాధనాలు, డిజిటల్ అభ్యాసంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ పొందిన డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ విద్యపై అవగాహన కల్పించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనతో ప్రారంభమైన ఈ కార్యక్రమం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణి, ఉన్నత విద్యామండలి కమిషనర్ దేవసేన, సంయుక్త సంచాలకులు బాలభాస్కర్, రాష్ట్ర కృత్రిమ మేధా నోడల్ అధికారి డాక్టర్ సరిత మార్గదర్శకత్వంలో నిర్వహించబడుతోంది. ఆధునిక కాలంలో వేగంగా జరుగుతున్న సాంకేతిక మార్పులను ప్రభుత్వ పాఠశాలల ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు పరిచయం చేసి, కృత్రిమ మేధా వినియోగంలో వారిని సిద్ధం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉప ప్రిన్సిపాల్ డాక్టర్ మర్రిపల్లి భూపతి, అంతర్గత నాణ్యత పరిరక్షణ విభాగం సమన్వయకర్త డాక్టర్ యు. దశరథ, నోడల్ అధికారులు డాక్టర్ పి. భ్యాలా, ఎన్. రాజయ్య, వి. శ్వేత, భీమ్‌గల్ డిగ్రీ కళాశాల నోడల్ అధికారులు డాక్టర్ బి. సుమలత, శంకర్, అధ్యాపకులు డాక్టర్ టి. రవీందర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ వనరుల వ్యక్తిగా క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాల సహాయ ఆచార్యులు గుండాజీ సృతిన్ విద్యార్థులకు శిక్షణ అందించారు.

## గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గా రియాజ్ నియామకం



ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గా షేక్ రియాజ్ ఏకగ్రీవంగా నియామకం అయ్యారు. ఈ మేరకు బుధవారం సర్పంచ్ గంగామణి గంగారం ఆధ్వర్యంలో మాజీ గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ కాజాపురం మహేందర్ చేతుల మీదుగా నూతన గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ కు బాధ్యతలను అప్పగించారు. గ్రామ అభివృద్ధికి సంబంధించినటువంటి పనులను గ్రామ కమిటీ నిరంతరం పర్యవేక్షిస్తుందని నూతన గ్రామ కమిటీ చైర్మన్ షేక్ రియాజ్ స్పష్టం చేశారు. పాఠశాల అభివృద్ధితో పాటు గ్రామ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నూతన చైర్మన్ గా తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు గ్రామస్తులకు రుణపడి ఉంటానని ఆయనన్నారు. వైస్ చైర్మన్ గా ముడిగం పెద్ద సాయి రెడ్డి, తేలు రాములు, లోకర్ సాయిలు, బాగిర్తి నారాయణ, కుమ్మరి గణేష్, శ్రీపతి పెద్ద సాయిలు, ఖాజాపురం భూమేష్, తుమ్మల సత్యం, బండి సుదర్శన్, ఎడపల్లి నడిపి సాయిలు తదితరులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నవీన్ గౌడ్, కల్వరాల రఘుపతి రెడ్డి, దాసరి అంజయ్య, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బోనాల్ తండా ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం

### బాలల చదువు భవిష్యత్‌కి వెలుగు



లింగంపేట్, బతుకమ్మ : బాలల చదువు భవిష్యత్తుకు వెలుగు అని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి సూచించారు. బుధవారం బోనాల్ తాండ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసాన్ని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శోభారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ బాలల చదువు భవిష్యత్ కి వెలుగు అన్నారు. ప్రభుత్వం పాఠశాలలో అందిస్తున్న ఉచిత వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండ హాజరు కావాలని విద్యార్థులకు ప్రేరణ కల్పించారు. విద్య తో పాటు విద్యార్థులకు ఆట పాటల తో ఆహ్లాద వాతావరణం కలిగించి హాజరు నమోదు శాతం పెంచాలన్నారు. విద్యార్థులను బెస్ లైన్ టెస్ట్ కి సంసిద్ధం చెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రజనిప్రియ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ, ఉపాధ్యారాలు రమాదేవి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కొందరు మంత్రుల ఆస్తులు

# భారీగా పెరుగుతున్నాయి



పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అవినీతి, అక్రమ భూకబ్జాలు, ఇసుక దందాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. గతంలో జరిగిన ఈడీ దాడుల అంశాన్ని ప్రస్తావించిన కేటీఆర్, ఆ కేసులపై కాంగ్రెస్, బీజేపీ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. భూవివాదాలు సృష్టించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వివాదాస్పద భూముల పేరిట సెటిల్‌మెంట్లు జరుగుతున్నాయని ఆరోపించారు. మంత్రిగా ఉన్న పొంగులేటి ఇతర మంత్రులతో అహంకారంగా ప్రవర్తిస్తున్నారని, బీసీ మంత్రులకు తగిన గౌరవం ఇవ్వడం లేదని కేటీఆర్ విమర్శించారు. అధికారుల పట్ల కూడా అనుచితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. హౌసింగ్ శాఖ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తిన కేటీఆర్, ఎన్నికల సమయంలో ఇచ్చిన 20 లక్షల ఇళ్ల హామీ అమలులో ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు ఎన్ని ఇళ్లు అందించారో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై మాట్లాడుతూ, గతంలో రద్దు చేసిన భూమి శిస్తును తిరిగి అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రైతులపై అదనపు భారం మోపే నిర్ణయాలను ప్రభుత్వం విరమించుకోవాలని సూచించారు. అదే విధంగా ములుగు జిల్లాలో ఇసుక వ్యాపారం, టెండర్ల వ్యవహారాల్లో కూడా అవకతవకలు జరుగుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి కంటే విధ్వంసానికే ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. పాలేరు నియోజకవర్గంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా గులాబీ జెండానే ఎగురుతుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు, పలువురు బీఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు.

## ట్రిపుల్ ఐటి విద్యార్థిని

# ఆత్మహత్యయత్నం

సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన (17) బాలిక బాసరలో ట్రిపుల్ ఐటి హాస్టల్ భవనం పై నుంచి దూకింది. అక్కడ ఉన్న విద్యార్థులు, సిబ్బంది ముందుగా బాలికను భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి నిజామాబాద్ జిజిహెచ్ కు తరలించారు. బాలిక పరిస్థితి విషమంగా ఉండటంలో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ రిఫర్ చేసినట్లు తెలిసింది. బాలిక ఆత్మహత్య యత్నానికి గల కారణాలు తెలియ రాలేదు. బాసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించినట్లు తెలిసింది.

## హెచ్‌ఎఫ్‌ఏకి ఎంపికైన బోర్గాం విద్యార్థిని నక్షత్రకు ఘన సన్మానం



బోర్గాం(పి), బతుకమ్మ :5వ డివిజన్ పరిధిలోని బోర్గాం(పి) గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్) విద్యార్థిని మంగోలు నక్షత్ర ప్రతిష్టాత్మక హైదరాబాద్ ఫుట్‌బాల్ అకాడమీ (హెచ్ఎఫ్ఏ) కి ఎంపిక కావడం స్థానికంగా ఆనందోత్సాహాలకు కారణమైంది. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న నక్షత్ర తన ప్రతిభతో ఈ అరుదైన అవకాశాన్ని అందుకోవడం గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా 5వ డివిజన్ గ్రామ ప్రజల తరపున కార్పొరేటర్‌తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కలిసి నక్షత్రను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన నక్షత్ర భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి తమ ప్రాంతానికి మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆమె సాధించిన ఈ విజయం ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు నక్షత్రకు అభినందనలు తెలియజేస్తూ, ఆమె క్రీడా ప్రస్థానం మరింత విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు.

## న్యాల్కల్ రోడ్‌లో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులపై స్థల పరిశీలన



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :7వ డివిజన్ ప్రజల అభ్యర్థన మేరకు నుడా చైర్మన్ కేశ వేణు బుధవారం న్యాల్కల్ రోడ్‌లో ప్రతిపాదిత స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి స్థల పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో తరచూ ఎదురయ్యే నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. వర్షపు నీరు ఎలాంటి అవరోధాలు లేకుండా సక్రమంగా పారిపోయే విధంగా సమర్థవంతమైన డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకుని, సాంకేతిక నిపుణుల సూచనల మేరకు ఉత్తమ ప్రణాళికను రూపొందించి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ స్థల పరిశీలనలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు రామర్తి గోపి, జిల్లెల రమేష్, ధర్మారం అవిన్ తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మృతి

### అంత్యక్రియలకు హాజరైన ఎమ్మెల్యే భూపతిరెడ్డి



ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండలం లోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కస్పమోహన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందగా విషయం తెలుసుకున్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి చలించి అంత్యక్రియలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం కష్టపడి కాంగ్రెస్ పార్టీ విజయంలో కీలక పాత్ర వహించిన ముఖ్య నాయకులలో కస్ప మోహన్ ఒకరిని ఆయన అభివర్ణించారు. ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. కాంగ్రెస్ పార్టీకి మోహన్ మృతి తీరని లోటని అభివర్ణించారు. ఆయన మృతి పట్ల నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి తలారి సుధాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నవీన్ గౌడ్, కరుణాకర్, ఎల్లారెడ్డిపల్లి సర్పంచ్ సుజాత శేఖర్, మాజీ సర్పంచ్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.